సాక్షి
కామారెడ్డి

సోమవారం । 22 । మే । 2023



కానరాని 'పల్లె వెలుగులు'

పల్లెల్లోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

- 8లో ▸



నర్సరీల్లో పచ్చదనం..

హరితహారంలో భాగంగా వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
42.2 /27.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

మళ్లీ గల్ఫ్ బాట..!

- నిత్యం పదుల సంఖ్యలో పయనం
- ఖర్చులు పెరిగి కలిసిరాని ఎవుసం..
- ఉపాధి కోసం తప్పని వలసబాట

వ్యవసాయం అనుకూలించడం లేదు.. కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి. పైగా పంటపంటకూ అప్పులు పెరిగిపోతున్నాయి. పోనీ ఉన్న ఊళ్లో ఏదైనా పని చేసుకుందామంటే దొరకడం లేదు. దీంతో చాలా మంది పొట్టచేత బట్టుకుని గల్ఫ్ బాట పడుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో గల్ఫ్‌కు వెళ్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో వలసలు మరింత పెరిగి, ఊళ్లు ఖాళీ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



సాక్షి, కామారెడ్డి : పాలకులు గొప్పలకు పోతున్నారు. ప్రజలకు అన్నీ జేసినం, ఏ కష్టాలు లేవని చెప్పుకుంటున్నరు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఏమిటో ఎవరికీ పట్టడం లేదు. ముఖ్యంగా రైతులు, రైతుకూలీల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. పంటల సాగుకు పెట్టుబడులు అడ్డగోలుగా పెరిగాయి. రెక్కల కష్టం వృథా అవుతోంది. రైతుబంధు ఇస్తున్నం గదా ఇంకేముంది అని గొప్పగ చెప్పుకుంటున్న పాలకులకు రైతుకు పండింది ఎంత ? మిగిలింది ఎంత ? అనేది ఒకసారి పరిశీలన జరిపితే వాస్తవాలు తెలుస్తాయి. ముఖ్యంగా కామారెడ్డి లాంటి మెట్ట ప్రాంతంలో రైతులు అనేక కష్టాలు వెళ్లదీస్తున్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ప్రాణహిత–చేవెళ్ల పథకంలో భాగంగా 22వ ప్యాకేజీకి సంబంధించి కామారెడ్డిలో శంకుస్థాపన చేశారు. సాగునీటి కష్టాలు తీరినట్టేనని రైతులు మురిసిపోయారు. అయితే అనుకోని పరిస్థితుల్లో వైఎస్సార్ మరణించడంతో 22వ ప్యాకేజీకి గడ్డు రోజులు దాపురించాయి. తరువాత పాలకులు పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రాణహిత–చేవెళ్ల పథకాన్ని రీ డిజైన్ చేయడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరును మార్చారు. అయితే 22వ ప్యాకేజీ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా తయారైంది. ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో భూసేకరణ జరగలేదు. దీంతో రైతులకు సాగునీటి కష్టాలు తీరలేదు. ఇప్పట్లో తీరేట్టు కూడా లేదు. ఇదే ఈ ప్రాంతంలో పెద్ద సమస్య.

ఏజెంట్ల దగ్గర వరుస కడుతున్నారు..

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంతో పాటు వివిధ మండలాల్లో గల్ఫ్ ఏజెంట్ల దగ్గర వీసాల కోసం జనం వరుస కడుతున్నారు. దుబాయ్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో వీసాల కోసం ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. ఎంత ఖర్చయినా పరవాలేదని, మంచి పని, మంచి జీతం దొరికే వీసా ఇప్పించమంటూ వారి చుట్టూ తిరుగుతున్నారు. అప్పట్లో కరువుతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయ్యాయి. చాలామంది విజిట్ వీసాలపై గల్ఫ్ దేశాలకు వెళ్లారు. మళ్లీ ఇప్పుడు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏ ఊరికి వెళ్లినా కొత్తగా గల్ఫ్ వెళ్లిన వారు కనీసం పది నుంచి ఇరవై మంది పేర్లు వినిపిస్తున్నాయి. మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట, తాడ్వాయి, గాంధారి తదితర మండలాల నుంచి గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ ప్రాంతంలోనే సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అప్పులు చేసి మరీ గల్ఫ్ బాట పడుతున్నారు. ఇక్కడ ఉంటే అప్పులు తీరే మార్గం లేదని కొందరు పేర్కొంటున్నారు. నాలుగేళ్లు బయట కష్టపడితేనే నాలుగు పైసలు కనబడతాయని 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు.

రైతులే ఎక్కువ..

భూగర్భజలాలపై ఆధారపడి రాత్రింబవళ్లు కష్టించి పండించిన పంటలను అమ్ముకునేందుకు కూడా కష్టాలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎంత కష్టపడ్డా పెరిగిన పెట్టుబడులే పెద్ద సమస్యగా మారాయి. పంట చేతికంది అమ్ముకున్న తర్వాత వచ్చిన డబ్బులు, పెట్టిన ఖర్చులను లెక్కలు తీస్తే రైతులు నోరెళ్లబెట్టాల్సి వస్తోంది. పెట్టుబడులకు కూడా సరిపోవడం లేదు. ఇక రెక్కల కష్టం సంగతి దేవుడెరుగు. ప్రతీ సీజన్‌లో ఇదే పరిస్థితి ఎదురవుతోంది. బ్యాంకుల్లో చేసిన అప్పులు మాఫీ కాకపోవడం, పండించిన పంటతో మిగులబడి లేకపోవడంతో వ్యవసాయంపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ఇక లాభం లేదన్న భావనతో చాలామంది రైతులు గల్ఫ్‌వైపు చూస్తున్నారు. గడచిన ఆర్నెళ్ల కాలంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వందల సంఖ్యలో గల్ఫ్ బాట పట్టినట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ కామారెడ్డి ప్రాంతం నుంచి పదుల సంఖ్యలో గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. రైతులు, రైతుకూలీలే ఎక్కువగా గల్ఫ్ బాట పడుతున్నారు.

నిప్పుల కొలిమి !

- జిల్లాలో మరింత పెరిగిన ఎండలు
- హీటెక్కిన సర్వాపూర్



సాక్షి, కామారెడ్డి : జిల్లా అంతటా ఆదివారం ఎండలు మరింత పెరిగాయి. అత్యధికంగా గాంధారి మండలం సర్వాపూర్‌లో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిప్పుల కొలిమిని తలపించేలా ఎండలు దంచికొడుతుండడంతో జనం అల్లాడుతున్నారు. జిల్లాలో ని ఆయా ప్రాంతాల్లో ఉదయం నుంచే సూర్యు డు తన ప్రతాపాన్ని చూపాడు. దీంతో ఎండలకు చాలా మంది తల్లడిల్లిపోయారు. ఆదివారం ఫంక్షన్లు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఉండడంతో వెళ్లడానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఫంక్షన్లకు హాజరైన వాళ్లంతా ఉక్కపోతతో తల్లడిల్లిపోయారు. జిల్లా అంతటా ఎండలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సన్‌డే నమోదైన ఉష్ణోగ్రతలు

సర్వాపూర్	44.5	బీర్కూర్	41.2	సోమూర్	39.9
మక్దుంపూర్	44.2	మేనూర్	40.8	లింగంపేట	39.9
భిక్కనూరు	43.8	నాగిరెడ్డిపేట	40.6	పుల్కల్	39.7
దోంగ్లీ	42.1	కామారెడ్డి	40.5	ఇసాయిపేట్	39.7
గాంధారి	42.0	లచ్చాపేట్	40.5	జుక్కల్	39.7
కొల్లూర్	42.0	పెద్దకొడప్‌గల్	40.4	తాడ్వాయి	39.7
పిట్లం	41.8	నస్రుల్లాబాద్	40.3	సదాశివనగర్	39.6
రామారెడ్డి	41.7	పాతరాజంపేట	40.3	రామలక్ష్మణ్‌పల్లి	39.3
మాచాపూర్	41.5	బిచ్కుంద	40.1	బీబీపేట్	38.7
బొమ్మన్‌దేవ్‌పల్లి	41.4	దోమకొండ	40.0	ఆర్గొండ	38.4
హసన్‌పల్లి	41.2				

చిన్నగొడప్‌గల్ శివారులో చిరుత సంచారం



పిట్లం (జుక్కల్) : పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం చిరుతపులి సంచరించింది. నూతనంగా నిర్మిస్తున్న 33 / 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రహరీ వద్ద ఉన్న చింత చెట్ల కింద నుంచి చిరుత పులి వెళ్తుండగా స్థానికులు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. విషయం తెలుసుకున్న పిట్లం అటవీశాఖ అధికారులు చిరుత సంచరించిన ప్రాంతానికి వెళ్లి పులి పాద ముద్రలను పరిశీలించారు. గ్రామ పరిసరాల్లోకి రైతుల ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్లాలని ఒంటరిగా వెళ్లవద్దని ఫారెస్ట్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. చిరుత సంచారంపై చిన్నకొడప్‌గల్ గ్రామంతో పాటు పక్క గ్రామాల్లో దండోరా వేయిస్తున్నామన్నారు. ఆహారం కోసం అటవి ప్రాంతం నుంచి గ్రామ శివారులోకి చిరుత రావచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



మాచారెడ్డి : కొత్తగా ఏర్పాటైన పాల్వంచ మండలానికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎంపీపీ నర్సింగరావ్ ప్రారంభించనున్నారు. కామారెడ్డి–సిరిసిల్లా రహదారిపై ఉన్న రైతు వేదికలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పది గ్రామాలతో ఏర్పాటైన పాల్వంచ మండలానికి సంబంధించిన సేవలు నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సింగరావ్ మాట్లాడుతూ పాల్వంచ నూతన తహసీల్దార్ కార్యాల ప్రారంభానికి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం అశోక్‌నగర్ పాత ఎస్పీఆర్ పాఠశాలలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల బాలుర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి మైనారిటీల నుంచి 6, 7, 8 తరగతులకు మైనారిటీ, ఇతర కులాల వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నారాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో ఉచితంగా సకల సౌకర్యాలతో పాటు మంచి పౌష్టికాహారం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, బోధన ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. దరఖాస్తులు వెబ్‌సైట్‌లో లేదా స్వయంగా పాఠశాలలో దరఖాస్తు చేయవచ్చన్నారు. వివరాలకు 9441315327లో సంప్రదించాలన్నారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో క్యాండిల్ లైట్ మెమోరియల్ డే



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏఆర్‌టీ సెంటర్ ఎదుట జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో క్యాండిల్ లైట్ మెమోరియల్ డేను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు ప్రదర్శించారు. జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ శిరీష మాట్లాడుతూ మే నెలలో మూడో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించామన్నారు. ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి గురించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్లు నాగరాజు, గోపాల్, ప్రవీణ్, చిరంజీవి, మెరాజ్, ఉదయ్, నాగేష్, వరల్డ్ ఆర్గనైజేషన్, టీబి సేవా సంఘం, చైల్డ్ ఫండ్ ఇండియా, పాజిటివ్ పీపుల్ నెట్‌వర్క్ ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులుగా గుర్తించండి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వం విప్ గంప గోవర్దన్‌కు ఐకేపీ వీవోఏలు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు రాజనర్సు, వీవోఏలు శివరాం, బాలరాజు, సరిత, శివ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సూచించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు ఇంట్లో వివాహ కార్యక్రమానికి వెళ్తున్న అయనకు మార్గ మధ్యలోని ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులో బీజేపీ శ్రేణులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, కార్యదర్శులు తదితరులున్నారు.

స్వగ్రామానికి వెళ్తూ మృత్యువాత

- మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదం
- నలుగురి దుర్మరణం..
- మృతులంతా దగ్గరి బంధువులే
- మృతుల్లో ఆలూర్‌కు చెందిన తండ్రీ కొడుకులు..
- భార్య మరో కొడుకుకు తీవ్రగాయాలు



కవిత నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆర్మూర్ టౌన్ : ఉపాధి కోసం మెదక్ జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలోని ఆలూర్‌కు వలస వచ్చిన కుటుంబంలో విషాదం నెలకొంది. వేసవి సెలవుల్లో తమ స్వగ్రామంలో ఎల్లమ్మ పండుగతో పాటు బంధువులను పరామర్శించడానికి ఆటోలో బయల్దేరిన ఆ కుటుంబాన్ని కారు ప్రమాదం రూపంలో చిన్నాభిన్నం చేసింది. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలో వల్లూర్ వద్ద 64వ నెంబర్ జాతీయ రహదారిపై కారు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆలూర్‌కు చెందిన ఇప్పాల శేఖర్ (45), చిన్నకొడుకు యశ్వంత్ (11) సిద్దిపేట జిల్లా గజ్వేలకు చెందిన బాల నర్సయ్య (65), మణెమ్మ (60)మృతి చెందారు. శేఖర్ భార్య కవిత, పెద్దకొడుకు అవినాష్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లాలోని జగితాపూర్ మండల కేంద్రానికి చెందిన శేఖర్ సుమారు 30 ఏళ్ల క్రితం వ్యవసాయ కూలీగా ఆలూర్ గ్రామానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. తర్వాత కాలంలో ఆయనకు ఆలూర్ గ్రామానికే చెందిన కవితతో వివాహం కాగా ఇల్లరికం అల్లుడిగా ఉంటూ ఆలూర్‌లోనే పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు అవినాష్, యశ్వంత్ ఉన్నారు. శేఖర్ ఆటో నడిపిస్తూ, కవిత మైనారిటీ గురుకుల పాఠశాలలో వంట మనిషిగా, బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి కొడుకులు అవినాష్, యశ్వంత్‌లు మైనారిటీ గురుకుల పాఠశాలలోనే 8వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. గజ్వేల్‌లో నివాసం ఉంటున్న శేఖర్ చిన్నమ్మ, చిన్నాన్న బాలనర్సయ్య, మాణెమ్మలు తమ ఇంట్లో నిర్వహించే ఎల్లమ్మ పండుగకు రావాలని చెప్పేందుకు ఆలూర్‌కు రాగా వారితోనే శేఖర్‌కుటుంబ సభ్యులు నలుగురూ కలిసి ఆదివారం ఉదయం 4 గంటలకు శేఖర్ నడిపించే ఆటోలోనే గజ్వేల్‌కు బయలుదేరారు. నార్సింగి వద్ద వీరి ఆటోను వెనక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో శేఖర్, యశ్వంత్, బాల నర్సయ్య, మణెమ్మమృతిచెందగా, శేఖర్ పెద్ద కొడుకు అవినాష్, భార్య కవితకు తీవ్ర గాయాలయ్యాయి. కవితను హైదరాబాద్‌కు తరలించగా అవినాశ్‌కు స్థానికంగా చికిత్స చేస్తున్నారు.

మధుర ఫలం.. విషతుల్యం

- వేసవిలో మామిడి పండ్లకు డిమాండ్
- కృత్రిమంగా మాగబెట్టేందుకు రసాయనాల వాడకం
- పట్టణంలో పండ్ల వ్యాపారుల ఇష్టారాజ్యం
- ప్రమాదకర ఎథిలీన్, క్యాల్షియం కార్బైడ్‌ల వినియోగం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



కామారెడ్డిలో విక్రయిస్తున్న మామిడి పండ్లు

కామారెడ్డి క్రైం : వేసవి అంటేనే మామిడి పండ్లకు ప్రత్యేకం. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా మామిడి పండ్లను తినడానికి ఇష్టపడతారు. నిత్యం లక్షల విలువైన అమ్మకాలు ఉంటాయి. ఇదే కాకుండా సీజన్‌ను బట్టి పండ్ల విక్రయాలు కొనసాగుతుంటాయి. ఇదే అదనుగా పండ్ల వ్యాపారులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం పండ్లను కృత్రిమ పద్ధతిలో మాగ బెట్టేందుకు ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తుంటారు. ఇలాంటి ఘటనలు ఇదివరకు చాలా చోట్ల వెలుగు చూశాయి. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో అధికారులు చేపట్టిన తనిఖీల్లోనూ ఇథలీన్ వాడకాన్ని గుర్తించారు. ఆహార భద్రతా అధికారుల తనిఖీలు లేకపోవడంతో కామారెడి లోనూ ప్రమాదకర రసాయనాల వాడకం యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తుంది. కనీస తనిఖీలు లేక పండ్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పండ్ల వ్యాపారంపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తుంది.

కనిపించని తనిఖీలు..

పండ్లను మగబెట్టడానికి వినియోగించే ప్రమాదకర రసాయనాలను సుప్రీం కోర్టు గతంలోనే నిషేధించింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వాలు నిబంధనలను అమలు చేస్తున్నాయి. అయినా చైనా లాంటి దేశాల నుంచి అక్రమంగా రసాయనాలను దిగుమతి చేసుకుంటూ కొందరు వ్యాపారులు పట్టణాలు, గ్రామాలకు చేరుస్తున్నారని తెలుస్తుంది. ఎక్కడా ఆహార భద్రతా అధికారుల నిఘా కనిపించడం లేదు. కనీస తనిఖీలు లేక వ్యాపారులు మితిమీరుతున్నారు. సరైన అవగాహన లేక జనం మార్కెట్‌లో లభిస్తున్న పండ్ల కొనుగోలు చేస్తున్నారు. వాటి వెనుక ఉన్న ప్రమాదాన్ని గుర్తించడం లేదు. ఒక్క మామిడి పండ్లే కాకుండా సీజన్‌ను బట్టి అన్ని రకాల పండ్లను ఇలాంటి రసాయనాలను వినియోగిస్తూ మాగబెట్టి మార్కెట్‌లోకి తెస్తున్నారు.

ప్యాకెట్ల రూపంలో..

సహజంగా మాగిన పండ్లను తింటే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు. కానీ సహజంగా పండ్లను మాగబెట్టడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎంత కావాలంటే అంత మొత్తంలో పండ్లను మాగబెట్టాలంటే ఇథలీన్, కాల్షియం కార్బైడ్ అనే రసాయనాలను వినియోగిస్తారు. ఇవి ప్యాకెట్ల రూపంలో ఉంటాయి. ప్యాకెట్ చుట్టూ రంధ్రాలుంటాయి. ఇథలీన్ కలిగిన పౌడర్ ప్యాకెట్‌ను పండ్ల బుట్ట మధ్యలో పెడితే రంధ్రాల నుంచి వెలువడే రసాయనాలతో రాత్రికి రాత్రే పండ్లు మాగుతాయి. అంతేగాకుండా ఆకర్శనీయంగా కనిపించే తెలుపు, పసుపు పచ్చని రంగుల్లోకి రంగుల్లోకి మారుతాయి. కానీ ఆయా రసాయనాలను వాడటం ద్వారా కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను తినడం ఆరోగ్యానికి అత్యంత హానికరం. శ్వాసకోశ, గ్యాస్ట్రిక్, జీర్ణ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువ. అయినా పండ్లు సరఫరా చేసే ప్రతి డీలర్, వ్యాపారి దగ్గర ఇలాంటి రసాయానాలు ఉంటున్నట్లు తెలుస్తుంది.

రేషన్ డీలర్ల సమ్మె సైరన్

- జూన్ 5వ తేదీ నుంచి రేషన్ పంపిణీకి దూరం
- రేషన్ షాపుల ఎదుట వాల్ పోస్టర్ల ఏర్పాటు



కలెక్టరేట్ ఏవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న రేషన్ డీలర్లు (ఫైల్)



పట్టణంలోని రేషన్ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కామారెడ్డి రూరల్ : రేషన్ డీలర్లు సమ్మె బాట పట్టారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా తమ న్యాయమైన హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు జూన్ 5వ తేదీ నుంచి బంద్ పాటించనున్నట్లు జిల్లాలోని రేషన్ డీలర్లందరు తమ రేషన్ దుకాణల ఎదుట వాల్ పోస్టర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 578 మంది రేషన్ షాపులు ఉండగా గతంలో 9 రకాల సరుకులు పంపిణీ జరిగేది. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. క్వింటాలుకు రూ.70 కమీషన్ మాత్రమే చెల్లిస్తుండగా అందులో హమాలీ, ఇంటి అద్దె, గుమాస్తా చార్జీలు, కరెంట్, ఇతరత్రా పోనూ నెలకు రూ.1000 కూడా మిగలడం లేదని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం గౌరవ వేతనం, రేషన్‌షాప్‌లను మినీ సూపర్‌మార్కెట్లుగా మారుస్తామని హామీనిచ్చింది. నేటికి అ మలుకాకపోగా ఇదే సమ్మెకు కారణమని తెలుస్తోంది.

ప్రజాప్రతినిధులకు వినతులు..

మండలం నుంచి జిల్లాస్థాయి వరకు రేషన్ డీలర్లు తహసీల్దార్, కలెక్టర్, డీఎస్‌వోలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు సైతం వినతి పత్రాలు అందజేశారు. జూన్ 5వ తేది నుంచి సమ్మెకు వెళ్తున్నామని, ఆలోగా తమ సమస్యలను పరిష్కరిస్తే ఆందోళన చేపట్టమని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో రాస్తారోకో, ధర్నాలు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతులను అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గతంలో పలుమార్లు ఆందోళన విరమించారు. రేషన్ డీలర్ల సమస్యల సాధనకు ఇటీవలే రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జేఏసీగా ఏర్పాటైంది.

డిమాండ్లు పరిష్కరించాలి



వచ్చేనెల 4వతేదీ లోపు సమస్యలను పరిష్కరించని యెడల జూన్ 5వ తేది నుంచి సమ్మెకు దిగుతాం. ఇందు కు అనుగుణంగా రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీసు అందించాం. డిమాండ్లు పరిష్కరించేంత వరకు పోరాటం తప్పదు.

– గౌరిశెట్టి రాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి

రైతులకు అండగా నిలవాలి



కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి : గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ సీడీసీ చైర్మన్, డైరెక్టర్లు రైతులకు అండగా నిలవాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో చైర్మన్ ఐరేని నర్సయ్య, డైరెక్టర్లు మల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డిల ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన ఆయన మాట్లాడారు. సీడీసీ నూతన పాలకవర్గం అటు ఫ్యాక్టరీ యాజమాన్యానికి, ఇటు రైతులకు వారధిగా నిలిచి సేవలందించాలన్నారు. ఇంత పెద్ద ఫ్యాక్టరీ మన కామారెడ్డి ప్రాంతంలో నెలకొల్పడం మన అదృష్టమని గంప గోవర్ధన్ అన్నారు. రైతులు చెరకు ఉత్పత్తి పెంచడానికి యాజమాన్యంతో పాటు పాలకవర్గం కృషి చేయాలన్నారు. ఒకప్పుడు కామారెడ్డి గడ్డ చెరకు పంటకు అడ్డాగా ఉండేదన్నారు. ప్రస్తుతం మన ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిన తర్వాత చెరుకు ఉత్పత్తి పెరిగిందన్నారు. అనంతరం సీడీసీ చైర్మన్, డైరెక్టర్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గాయత్రీ షుగర్స్ వైస్ ప్రసిడెంట్ వేణుగోపాల్‌రావ్, జీఎం (కేన్) హరిబాబు, డిప్యూటీ కేన్ మేనేజర్ బాలరాజు, దోమకొండ, మాచారెడ్డి మండలాల బీఆర్ఎస్ నాయకులు బాల్‌చంద్రం, మధుసూదన్‌రావ్, నర్సింలు ఉన్నారు.

క్లుప్తంగా

కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ!

నవీపేట: మండల కేంద్రం శివారులోని సర్వే నంబరు–90లో విలేకరులకు కేటాయించిన స్థలంలో కొందరు కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ, భూమిని చదును చేయడంతో రెవెన్యూ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. నవీపేట శివారులో స్థానిక విలేకరులకు పదేళ్ల కిందట ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఇటీవల బోధన్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ స్థలం తనదని అధికారులను తప్పుతోవ పట్టించి కోర్టును ఆశ్రయించాడు. సదరు కోర్టు ఈ వివాదంపై స్టేటస్‌కో ఆర్డర్ జారీ చేసింది. ఇదిలా ఉండగా ఆదివారం సెలవు దినాన్ని ఆసరగా చేసుకున్న సదరు వ్యక్తి జేసీబీలతో సర్వే నంబరు 90లోకి దౌర్జన్యంగా చొరబడి భూమిని చదును చేయించాడు. దీంతో విలేకరులు ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా పనులను అడ్డుకున్నారు.

పల్లెలను శుభ్రంగా ఉంచాలి



బాన్సువాడ రూరల్(బాన్సువాడ): పల్లెలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పల్లెవెలుగు ఇన్‌చార్జి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇబ్రహీంపేట్, రాంపూర్‌తండా, రాంపూర్, పులికుచ్చతండా, పోచారం, దేశాయ్‌పేట్ గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్యం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెలను మరింత శుభ్రంగా, అభివృద్ధి దిశగా నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రత్యేక పల్లె ప్రగతి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అనంతరం పలు గ్రామాల్లో నర్సరీలను ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దోడ్ల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్ పనుల పరిశీలన



నిజామాబాద్‌నాగారం: నగరంలో కొత్తగా నిర్మిస్తున్న ఐటీ హబ్ పనులను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆదివారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌లను ఆదేశించారు.

ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య



హరిణి (ఫైల్)

నవీపేట: మండలకేంద్రంలో తన ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని ఓ యువతి మనస్తాపం చెంది, ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాజారెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన ఎన్నెడ్ల హరిణి(25), ఏడేళ్లుగా ఇదే గ్రామానికి చెందిన అక్తర్ అనే యువకుడిని ప్రేమించింది. ఈక్రమంలో ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా ప్రియుడు నిరాకరించాడని పేర్కొన్నారు. దీంతో ఆదివారం తీవ్ర మనస్తాపానికి గురైన హరిణి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

బాన్సువాడ టౌన్: పట్టణానికి చెందిన మంగలి ఆనంద్ బాబు(30) అనే వ్యక్తి మద్యానికి బానిసగా మారి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. గత కొన్నేళ్లుగా ఆనంద్ తాగుడుకి బానిసయ్యాడని వివరించారు. ఈక్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అన్నారు.

పల్లెల్లో కానరాని 'పల్లె వెలుగులు'

- ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్న గ్రామీణులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



ఆటోలో వెళ్తున్న సింగీతం గ్రామ ప్రజలు

నిజాంసాగర్(జుక్కల్): 'పల్లె, పల్లెకు ప్రగతి రథం' పేరిట ఆర్టీసీ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో మాత్రం అమలు సాధ్యం కావడం లేదు. పల్లెలకు 'పల్లె వెలుగు'లు రాకపోవడంతో ప్రజలు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు..

ఆర్టీసీ ఆదాయానికి గండి..

బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాల్లోని పల్లెల్లో ప్రజా రవాణాలో ప్రయివేట్ వాహనాలు జోరు కొనసాగుతోంది. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రయివేట్ వాహనాలు ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నా.. ఆర్టీసీ అధికారులు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రయివేట్ డ్రైవర్లు తమ వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణికులను తరలిస్తూ, ప్రమాదాలకు దారితీస్తున్నారు. అయినా గత్యంతరం లేక ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలను వినియోగించాల్సి వస్తోంది.

బస్సులు రాని గ్రామాలు ఇవే..

నిజాంసాగర్ మండలంలోని తెల్గాపూర్, సింగితం, తున్కిపల్లి, బూర్గుల్, గున్కుల్, నర్వ, జక్కాపూర్ గ్రామాలు, పిప్పిరేగడి తాండ, మల్లూర్ తాండ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేవు. మిగితా గ్రామాలకు బస్సు సర్వీసులు ఉన్నా పాఠశాలల సమయంలో మాత్రం బస్సులు నడుస్తున్నాయి. పిట్లం మండలంలోని కంబాపూర్, అన్నారం, కిష్టాపూర్, బ్రహ్మణపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు బస్సులు రావడం లేదు. పెద్దకొడప్‌గల్ మండలంలోని వడ్లం, బేగంపూర్, కాస్లాబాద్, పెద్దదేవిసింగ్‌తండా, కుబ్యానాయక్‌తండా, కాటేపల్లి, పోచారం, శివ్వాపూర్, విఠల్‌వాడి గ్రామాలకు బస్సులు లేవు. బిచ్కుంద మండలంలోని హస్గుల్, ఖద్గాం, గోపన్‌పల్లి, మొక్క, చిన్నదడ్గి, మానేపూర్, శాంతాపూర్, తక్కడ పల్లి గ్రామాలకు బస్సులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులు రాని గ్రామాలకు, మారుమూల పల్లెలకు బస్సు సర్వీసులు నడపాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతి గ్రామానికి నడుపుతాం..

బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలో 257 గ్రామాలకు గాను 211 గ్రామాలకు ఆర్టీసీ కనెక్టివిటి ఉంది. పల్లె, పల్లెకు ప్రగతి రథం ఉన్నా.. ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుంది. మారుమూల గ్రామాలు కాకుండా ప్రధాన రూట్లల్లో ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో కాకుండా ప్రయివేట్ వాహనాల్లో ప్రయాణం చేస్తున్నారు. ప్రయివేట్ వాహనాలను పక్కన పెడితే ప్రతీ గ్రామానికి బస్సు సర్వీసులు నడుపుతాం.

– సదాశివ, ఆర్టీసీ డీఎం, బాన్సువాడ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మిర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్ 1987-88 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



ఆత్మకూర్ జెడ్పీహెచ్ఎస్ 1999-2000 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

నస్రుల్లాబాద్/బాన్సువాడ రూరల్/నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987–88 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. దీంతోపాటు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలాగే నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో 1999–2000బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2002–2003 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.



బోర్లం గురుకుల పాఠశాల 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

సర్పంచుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచులు

సుభాష్‌నగర్: సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏటీఎస్ శ్రీనివాస్ కోరారు. ఈమేరకు వారు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లాలో సర్పంచులు ఎదుర్కొంటున్న 14 రకాల సమస్యలు, ఇతరత్ర అంశాలపై సుమారు గంటన్నరపాటు మంత్రితో చర్చించారు. సమస్యలు పరిష్కారం కాక సర్పంచులంతా అసంతృప్తితో ఉన్నారని, ఇటీవల కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి సర్పంచుల సమస్యలను వెంటనే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సంబంధిత అధికారులతో పరిష్కార మార్గాలపై చర్చిస్తానని తెలిపారు. ఈసందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఎడ్ల రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, కోశాధికారి నరహరి, సభ్యులు శంకర్, ఆనంద్, గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ హయాంలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



వినాయక్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖలీల్‌వాడి: తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు ఎప్పుడూ లేనివిధంగా సీఎం కేసీఆర్ పాలన రెట్టింపు అయ్యాయని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఒక ఏడాది వరి వేయవద్దని, మొక్కజొన్న వేయాలని, మళ్లీ దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేయమని చెప్పి, రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని, దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రూ.లక్షల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టులు నిర్మించినా, రైతులు సాగునీరుకు, మంచినీటికి ఎందుకు ఇబ్బందులకు గురైతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కాంట్రాక్టర్‌లకు దోచిపెట్టి, కమీషన్లు తీసుకోవడానికే ప్రాజెక్టులు నిర్మించిందన్నారు. జిల్లా రైతులు, ప్రజలు మంచి నీటికి, సాగునీటికి ఇబ్బంది పడుతున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలను నిర్మించినట్లు గుర్తు చేశారు. రైతుబంధు పేరుతో డబ్బులు ఇచ్చి, అదనంగా ఇచ్చే సబ్సిడీలను ఇవ్వడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర రైతాంగం కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి..

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వినాయక్ నగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశవేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, మీసాల సుధాకర్, వేణురాజ్, వీక్కీయాదవ్, గోపి, సంతోష్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు బీమా భరోసా

- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల ఆర్థికసాయాన్ని ఇవ్వనున్న ప్రభుత్వం!
- విధివిధానాల కోసం మంత్రి తలసాని ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల కోసం బీమా పథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. రైతులకు బీమా అందించిన విధంగా గీత కార్మికులకు కూడా ఆర్థిక సాయాన్ని ఇవ్వనుంది. గీత కార్మికులు చెట్టు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రాణాలు కోల్పోతున్న బాధిత కుటుంబాన్ని రూ.5లక్షల బీమా సాయంతో ప్రభుత్వం ఆదుకోనుంది. ఈపథకానికి సంబంధించిన విధివిధాలను రూపొందించడానికి ప్రభుత్వం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసింది.

నిజామాబాద్ జిల్లాలో 5,703 గీత కార్మికులు

నిజామాబాద్ జిల్లాలో 116 గీత కార్మిక సహకార సంఘాలు ఉండగా.. ఇందులో 5,703 గీత కార్మికులు సభ్యులు ఉన్నారు. అలాగే గ్రామాల్లో వ్యక్తిగతంగా గీత కార్మికులు(టీఎఫ్‌టీ)సభ్యులు 1834 మంది ఉన్నారు. ఈ స్కీం అమలు అయితే గీత కార్మికుల కుటుంబాలకు భరోసా లభిస్తుంది. గీత వృత్తినే జీవానాధారంగా కార్మికులు పని చేస్తున్నారు. గీత కార్మికుల్లో తాటి చెట్లు, ఈత వానాలు గీసే వారు ఉన్నారు. వీరిలో ఎక్కువగా ప్రమాదాలు తాటి వనాలలో పని చేసే వారికే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈత చెట్టు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పాముకాటు కాగా ఈత కల్లుకు తాగేందుకు వచ్చిన పాములతో గీత కార్మికులు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. తాటి వనాలు పెద్దగా ఉండటంతో పైనుంచి పడి వెన్నుపూస విరిగి మంచం పడిన గీత కార్మికులు ఉండగా.. ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. గీత కార్మికులకు, సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారు ప్రమాదవశాత్తూ ఎలాంటి ఘటనలు జరిగిన ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తోంది. మృతి చెందిన, శాశ్వత అంగవైకల్యం పొందిన వారి కుటుంబానికి రూ. 5వేలు, గాయాలపాలైన వారికి రూ. 10వేలు అందిస్తారు. ఎక్స్‌గ్రేషియా చెట్టు ఎక్కిన సమయంలో జరిగితేనే వర్తిస్తుంది. వేరే విభాగాలలో పని చేసిన వారికి ప్రమాదాలు జరిగినా, మృతి చెందినా ఎక్స్‌గ్రేషియా వర్తించదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గీత కార్మికుల బీమా మాత్రం ప్రమాదవశాత్తు గాని సాధారణంగా మృతి చెందిన ఈ బీమా వర్తించనుంది.

మటన్ దుకాణాలపై దాడులు

- పలువురికి జరిమానా



నిజామాబాద్‌నాగారం: నగరంలో మటన్ దుకాణాలపై ఎంహెచ్‌వో సాజిద్‌అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. స్లాటర్‌హౌజ్, హైమాదీమార్కెట్, వీక్లీమార్కెట్ ప్రాంతాల్లో మటన్ దుకాణాలపై తనిఖీలు చేపట్టారు. కొంతమంది వ్యాపారులు స్లాటర్ హౌజ్‌లో కాకుండా వేరే చోట మూగ జీవాలను వధించడం గమనించి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా వేశారు. మళ్లీ ఇలాంటివి చేస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. జవాన్‌లు రజాక్, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధి వంచితులకు కొత్త రూపం



నిరాశ్రయులకు సపర్యలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: వారికి మండే ఎండలు, ఆకలి మంటలు తెలీవు. వారి ప్రయాణం ఎటో తెలియదు. రోడ్లే వారికి ఆవాసాలు.. వారెవరో వారికే తెలియదు.. మురికిబట్టలు, ఊడలు కట్టిన జుట్టుతో తిరుగాడుతూ ఉంటారు. అలాంటి వారికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'మానవత్వంతో ఆలోచిద్దాం' కార్యక్రమం పేరిట కొత్త రూపాన్ని ఇచ్చింది. ఆదివారం బోధన్, నిజామాబాద్‌లో రోడ్లపైన నిస్సహాయక స్థితిలో, విధివంచితులుగా తిరుగాడే వారిని గుర్తించి వారికి సపర్యలు చేశారు. పట్టణ పరిసరాల్లో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ చేసిన సేవలు చూసి పలువురు అభినందించారు. బోధన్, నిజామాబాద్ పోలీస్ సిబ్బంది, సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, విజయ్, శివ, వినోద్, సాయి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్‌గార్డెన్ రోడ్ సమీపంలోగల సిటీ లైన్ లాడ్జ్ రూంలో పేకాట ఆడుతున్న షేక్ సిరాజ్, మహమ్మద్ ఇర్ఫాన్, బిలాలుద్దీన్, షేక్ ఇసాక్, షేక్ సలీం, మహమ్మద్ రఫీక్, షేక్ నజీర్‌లను అరెస్టు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా దుబ్బ ప్రాంతంనకు చెందిన వారన్నారు. వీరి నుంచి రూ.7400 నగదు, 7సెల్‌ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమన్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బీబీపేట: కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన ఆదివారం యాడారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు ఇలా.. యాడారం గ్రామానికి చెందిన వడ్ల ప్రసాద్ (30) శనివారం సాయంత్రం కిరాణ సామాన్లు తీసుకురావడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. దగ్గర్లో ఉన్న చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లిన ఆయన చెరువులోకి దిగాడు. దీంతో కాలు జారీ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గమనించి, కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వారు శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలూర్ గ్రామంలో ఒకరు..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్ గ్రామంలోని గొల్లకుంట చెరువులో పడి ఒకరు మృతిచెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి ఆదివారం తెలిపారు. కాలూర్‌కు చెందిన ఎర్రగోళ్ల చిన్న సాయిలు(46)కు చిన్నతనంలోనే తల్లి దండ్రులు మృతిచెందారు. సాయిలు గ్రామంలోనే పనిచేసుకుంటూ, వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ జీవనం గడిపేవాడు. ఐదురోజుల క్రితం సాయిలు చెరువు వైపు వెళ్లటాన్ని ఒకరు చూశారు. ఆదివారం సాయిలు మృతదేహం చెరువులో తేలటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని బయటకు తీయించారు. మృతుడి ముఖం గుర్తుపట్టని విధంగా మారింది. సాయిలుకు వరుసకు మరదలైన లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు..



గున్లావార్ అనిల్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మొగా గ్రామానికి చెందిన గున్లావార్ అనిల్(24) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఆదివారం ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మొగా గ్రామంలోని టెంట్‌హౌస్‌లో అనిల్ డెకరేటర్‌గా పని చేస్తుండేవాడు. మద్నూర్ మండలంలోని మేనూర్‌లో శనివారం సాయంత్రం ఓ కార్యక్రమంలో భాగంగా డెకరేట్ చేస్తుండగా అతడికి 33 కేవీ విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అనిల్‌ను మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

దుబాయిలో బోనాల్ వాసి అదృశ్యం



గరిగే ప్రభాకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన గరిగే ప్రభాకర్(35) అనే వ్యక్తి దుబాయ్ దేశంలో అదృశ్యమైనట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. బోనాల్ గ్రామానికి చెందిన గరిగే ప్రభాకర్ బతుకుదెరువు కోసం మే 2న కంపెనీ వీసాపై దుబాయికి వెళ్లాడు. 3న కంపెనీకి సంబంధించిన అకామిడేషన్ జాబ్‌లాలి ప్రాంతంలో చూపించారు. దుబాయిలోని పవర్ రిక్రూట్మెంట్ కంపెనీకి వెళ్లకుండా రూమ్‌లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి నేటి వరకు అతని ఆచూకీ దొరకలేదు. దీంతో అతని స్నేహితులు బోనాల్ గ్రామంలోని అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ముంబైలోని ఏజెంటుకు ఈ విషయం తెలియజేశారు. సదరు ఏజెంటు దుబాయిలోని కంపెనీ సిబ్బందితో మాట్లాడారు. ప్రభాకర్ కంపెనీలో జాయిన్ కాలేదని, పనికి రాలేదని చెప్పారు. దీంతో 15రోజులుగా ఆయన ఆచూకీ కోసం స్నేహితులు వెతుకుతున్నారు. ప్రభాకర్‌కు భార్య రాధ, ఇద్దరు కూతుళ్లు, తల్లిదండ్రులు పర్వయ్య, శాంత ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం, అప్పులు అధికం కావడంతో అప్పులు తీర్చడానికి దుబాయి వెళ్లిన ప్రభాకర్ అదృశ్యం కావడంతో భార్య, పిల్లలు, తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

నగరంలో యువకుడు..



శ్రీనాథ్

ఖలీల్ వాడి: నగరంలోని రోటరీనగర్కు చెందిన ఆది శ్రీనాథ్ (35) అదృశ్యం అయినట్లు ఎస్సై సందీప్ ఆదివారం తెలిపారు. అనారోగ్య కారణాలతో ఇటీవల శ్రీనాథ్ దుబాయ్ నుంచి వచ్చాడు. ఏప్రిల్ 28న స్నేహితులను కలిసి వస్తానని చెప్పి, ఇంటి నుంచి వెళ్లిన శ్రీనాథ్ ఇప్పటికీ తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల ఇళ్లలో వెతికినా అతడి ఆచూకీ దొరకపోవడంతో అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.